క్లుప్తంగా

విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు

బిక్కవోలు: మండలంలోని ఇలపల్లిలో విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి మాట్లాడుతూ అనుకోని ప్రమాదాలు జరిగినపుడు బ్లడ్ గ్రూప్ తెలిసుండటం చాలా కీలకమని, అందుకే విద్యార్థులందరికీ బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు తమలంపూడి ఈశ్వర్ రెడ్డి, సీహెచ్ వీరభద్రరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సీతానగరం: ఇనుగంటివారిపేటలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరం 16వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్యం లక్ష్మి, వైస్ చైర్మన్ సత్యం మోహనరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఉదయం నుంచీ బాబా వారికి ప్రత్యేక పూజలు చేశారు. ద్వారకామాయి ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం 11.30 గంటల నుంచి రెండు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

రాజానగరం: మండలంలోని మదర్ థెరిసా టైలర్స్ యూనియన్ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ టైలర్స్‌డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి, విలియమ్స్ హోం చిత్రపటానికి సంఘ సభ్యులు పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. పాఠశాల విద్యార్థులకు చాక్లెట్లు పంచారు. సంఘం అధ్యక్షుడు గూడాల గన్నిరాజు, కార్యదర్శి మంద శ్రీను, కోశాధికారి నూలు శివప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

బోటు కార్మికుల ఆందోళన

ధవళేశ్వరం: స్థానిక గాయత్రీ ఇసుక ర్యాంపులో డ్రెడ్జింగ్ బోట్లతో తవ్వకాలను నిలుపుదల చేయాలని కోరుతూ బోటు కార్మికులు ఆందోళన చేపట్టారు. బ్యారేజీకు మూడు కిలోమీటర్లలోపు ఇసుక తవ్వకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ ఇరిగేషన్, మైన్స్, రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డ్రెడ్జింగ్ బోట్ల కారణంగా బోటు కార్మికులు రోడ్డున పడుతున్నారన్నారు. ఆందోళనలో బోటు కార్మిక సంఘం నాయకులు వెంకట్రావు, సునీల్, శ్రీను, అప్పన్న పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: ఛాత్రోపాధ్యాయులు శాస్త్ర సాంకేతిక రంగాలలో శాస్త్రీయ దృక్పథం పెంచుకుని, పిల్లలను మంచి శాస్త్రవేత్తలుగా తయారు చేయాలని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్) ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేవీ సూర్యనారాయణ అన్నారు. డైట్ కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సైన్స్ అధ్యాపకుడు కె.గంగాధర్ మాట్లాడుతూ మనిషిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకువచ్చేదే సైన్సు అన్నారు. ఛాత్రోపాధ్యాయులు సుమారు 20 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేవీ సూర్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు జానకీదేవి, రామకృష్ణ, వీరభద్రరావు, డీఎస్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పెన్నుల వితరణ



పెన్నుల పంపిణీలో పాల్గొన్న చిన్న వెంకన్నబాబు స్వామీజీ

ప్రకాశం నగర్: శ్రీమహాలక్ష్మి అమ్మవారి దివ్య ప్రసాదంగా ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు సుమారు 4 వేల పెన్నులను పంపిణీ చేస్తున్నట్టు గాడాల శ్రీమహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వర స్వామివారి పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు తెలిపారు. దానవాయిపేటలోని భాష్యం జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం సుమారు 400 పెన్నులను ప్రిన్సిపాల్ ఎన్.రవికుమార్‌కు అందించారు. భాను జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జక్కంపూడి సత్యనారాయణకు 200 పెన్నులను అందజేశారు. చిన్న వెంకన్న బాబు మాట్లాడుతూ సర్వేజనా సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్టు, శ్రీమహాలక్ష్మి సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠం, మన గుడి - మన భారతీయ ఆధ్యాత్మిక సంపద, రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శనివారపు ధనరాజు, పడాల పండు, దివాన్ చెరువు సొసైటీ చైర్మన్ గంగిశెట్టి సోమేశ్వరరావు, నిర్మల జ్యోతి కుమారి, సైకాలజిస్టు అనంతలక్ష్మి, బసా సత్యనారాయణ, సేవాసమితి జాతీయ కార్యదర్శి మద్ది శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వర్జీనియా పొగాకు రైతులకు ఊరట

- నష్ట పరిహారం విడుదల చేసిన జగన్ ప్రభుత్వం
- హెక్టార్‌కు రూ.10 వేలు చొప్పున 772 మంది రైతులకు లబ్ధి
- హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే రాజా



మిచాంగ్ తుఫాను కారణంగా మునిగిపోయిన పొగాకు పంటను టుబాకో బోర్డు ఈడీ శ్రీధర్ బాబుతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి (ఫైల్)

సీతానగరం: వర్జీనియా పొగాకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పంటనష్ట పరిహారం విడుదల చేసింది. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వంలోనూ ఇలా జరగలేదు. మొట్ట మొదటి సారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారు. రైతుల సంక్షేమమే తనకు ముఖ్యమని, వారి అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానని మరోసారి చాటి చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కృషితో రైతులకు ఊరట కలిగింది.

980 హెక్టార్లలో సాగు

నియోజకవర్గంలో 980 హెక్టార్లలో వర్జీనియా పొగాకును రైతులు సాగు చేశారు. గత ఏడాది డిసెంబర్‌లో మిచాంగ్ తుపాన్ కారణంగా కురిసిన వర్షాలతో 698.82 హెక్టార్లలో పంటకు పూర్తిస్థాయిలో నష్టం వాటిల్లింది. మిగిలిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందిస్తుందని, కానీ పొగాకు పంటకు పరిహారం రాదని తెలుసుకున్న రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

ఎమ్మెల్యే రాజా సుడిగాలి పర్యటన

మిచాంగ్ తుపాన్ కారణంగా నష్టపోయిన పంట పొలాలను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరిశీలించారు. నియోజకవర్గంలో ఆయన సుడిగాలి పర్యటన జరిపారు. మిగిలిన పంటలతో పాటు వర్జీనియా పొగాకును పరిశీలించారు. పొగాకు రైతులకు ధైర్యం చెప్పి, ప్రభుత్వ పరంగా పరిహారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వెంటనే ఈ విషయాన్ని టుబాకో బోర్డు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. డిసెంబర్ 9న టుబాకో బోర్డు చైర్మన్ గరికిపాటి యశ్వంత్ ఆదేశాల మేరకు టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు వచ్చారు. ఆయనతో కలిసి ఎమ్మెల్యే జక్కంపూడి రాజాతో కలిసి నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. వారికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ధైర్యం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

పట్టుబట్టి.. ఒప్పించి..

వర్జీనియా రైతులకు నష్ట పరిహారం అందించే విషయంలో ఏమి చేయలేమని, ఇప్పటి వరకు పొగాకు పంటకు పరిహారం అందించిన దాఖలాలు లేవని టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పట్టుదలతో పోరాడి, పొగాకు పంటకు జరిగిన నష్టంపై నివేదికను టుబాకో బోర్డు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అందించి, రైతులకు నష్టపరిహారం మంజూరు చేయించారు. తద్వారా 772 మంది రైతులకు హెక్టార్‌కు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం అందింది.



మిచాంగ్ తుఫానుకు ముంపు బారిన పడిన పొగాకు పంట (ఫైల్)

ధన్యవాదాలు



14 ఎకరాల్లో వర్జీనియా పొగాకు పంట వేశాను. మిచాంగ్ తుపాన్ కారణంగా సుమారు రూ.8 లక్షలు నష్టపోయాను. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పొగాకు పంటను పరిశీలించి న్యాయం చేస్తానని చెప్పారు. అలాగే మాకు నష్ట పరిహారం ఇప్పించారు. రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్, ఎమ్మెల్యే జక్కంపూడికి రాజాకు ధన్యవాదాలు.

– మాకాల ఈశ్వరరావు, పొగాకు రైతు, ఉండేశ్వరపురం

పొగాకు రైతులకు పరిహారం



ఇప్పటి వరకూ జరగని రీతితో నియోజకవర్గంలో వర్జీనియా పొగాకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించింది. 698.82 హెక్టార్లు పంట నష్టపోగా, 772 మంది రైతులకు హెక్టారుకు రూ. 10 వేలు చొప్పున పరిహారం అందింది. టుబాకో బోర్డు అందించిన నివేదిక ప్రకారం ముఖ్యమంత్రి జగన్ నష్టపరిహారం మంజూరు చేశారు.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే

బీఎంసీయూల ద్వారా పాల సేకరణ



భూపాలపట్నంలోని బీఎంసీయూను పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్

రాజానగరం: అమూల్ పాల సేకరణ కేంద్రాల ద్వారా జిల్లాలోని పాడి రైతులకు మద్దతు ధరను అందించి, పాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. మండలంలోని భూపాలపట్నంలో ఏర్పాటు చేసిన బల్క్ మిల్క్ యూనిట్ (బీఎంసీయూ)ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ యూనిట్ ద్వారా శీతలీకరణ కోసం 46 జగనన్న పాల సేకరణ కేంద్రాలను అనుసంధానం చేస్తున్నామన్నారు. మార్చి ఒకటి నుంచి భూపాలపట్నం బీఎంసీయూ పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. గుజరాత్ నుంచి పాల శీతలీకరణ కేంద్రానికి అవసరమైన పరికరాలు వచ్చాయని, వాటిని బిగించి గురువారం ట్రైల్ రన్ నిర్వహిస్తారన్నారు. ప్రస్తుతం సుమారు 5 వేల లీటర్ల పాల సేకరణను లక్ష్యంగా చేసుకుని కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్‌జీటీ సత్యగోవింద్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, ఎంపీడీఓ ఎస్.జ్యోతిర్మయి పాల్గొన్నారు.

జంబూపట్నం బీఎంసీయూ పరిశీలన

మధురపూడి: కోరుకొండ మండలం జంబూపట్నంలోని బల్క్ మిల్క్ యూనిట్‌కు పాల శీతలీకరణ కోసం 46 జగనన్న పాలవెల్లువ కేంద్రాల ద్వారా పాలసేకరణ జరుగుతుందని ఈ మేరకు గ్రామ సభలు నిర్వహించి, తీర్మానాలు పూర్తయినట్టు జేసీ తేజ్ భరత్ తెలిపారు. జంబూపట్నం బీఎంసీయూ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు.

మహిళా కారాగారం పరిశీలన

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి బుధవారం సాయంత్రం సందర్శించారు. అక్కడి సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సహనంగా ఉండాలని, ఆవేశంలో చేసిన పనుల వల్ల తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని తెలిపారు. ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని, ఖైదీల తరపున వాదించేందుకు న్యాయవాది లేకపోతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా పారా లీగల్ వలంటీర్ల ద్వారా జిల్లా న్యాయ సేవాధికారసంస్థకు తెలపాలని సూచించారు. అనంతరం 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉచిత న్యాయ సహాయం అందిస్తున్న కోర్టు కేసుల వివరాలను, బెయిల్ పిటిషన్లు, అప్పీళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రఘునాథపురంలో గడప గడపకూ

రాజానగరం: జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి నేటి వరకూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, పేదలకు అండగా నిలిచారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ఆయనే ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు మీరంతా రాబోయే ఎన్నికలలో ఓట్ల ద్వారా అభిమానాన్ని చాటాలని కోరారు. మండలంలోని రఘునాథపురంలో బుధవారం రాత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, ఆయా కుటుంబాలకు అందిన తీరును గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో చిన్న సాయం కావాలన్నా ప్రజలు ఏ విధంగా ఇబ్బందులు పడేవారో తెలియజేస్తూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు అందిస్తున్న సేవలను, సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరును వివరించారు. జగనన్న పాలనలో పొందిన ప్రయోజనాలను ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రఘునాథపురంలో నీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ప్రతిపాదనల మేరకు నిధులు మంజూరులో చొరవ చూపుతూ ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని పాతతుంగపాడు, రాధేయపాలెం, శ్రీకృష్ణపట్నం గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించి, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పూర్తయిన వాటిని ప్రారంభించారు. ఏ గ్రామానికి వెళ్లిన నేడు ఎంతో మెరుగైన అభివృద్ధి కనిపిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చారన్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా, హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించడంతో పాటు సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణాలకు రూ.కోట్లు కేటాయించారని వివరించారు. జలజీవన్ మిషన్ పథకంలో మండలంలో 32 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే వీటి నిర్మాణ పనులు చేపట్టి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.



శ్రీకృష్ణపట్నంలో ఆర్‌బీకే భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజా



పాత తుంగపాడులో ఓహెచ్‌ఆర్ ప్రారంభోత్సవం

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

పాత తుంగపాడులో రూ.63.40 లక్షలు, రాధేయపాలెంలో రూ.66.60 లక్షలు, శ్రీకృష్ణపట్నంలో రూ.85.50 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. శ్రీకృష్ణపట్నంలో రూ. 21.80 లక్షలతో ఆర్‌బీకే, రూ.20.80 లక్షలతో హెల్త్ క్లినిక్, రూ.ఆరు లక్షలతో అంబేడ్కర్ పార్కులను నిర్మించి, ప్రారంభించారు. గ్రామంలో రూ.17.92 లక్షలతో చేపట్టే చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మానవాళి అభివృద్ధికి సైన్స్ మూలం



అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

- ఘనంగా జాతీయ సైన్సు దినోత్సవం
- ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

అనపర్తి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రాజెక్టుల పనితీరు, ఉపయోగాలను వివరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ మానవాళి అభివృద్ధికి సైన్స్ మూలమని, సైన్స్‌తో జీవితం ముడిపడి ఉందని అన్నారు. మారుతున్న కాలనికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు అత్యుత్తమ ప్రయోగాల ద్వారా దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పాఠశాల హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక జీబీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనకు వేదిక.. విజ్ఞాన వీచిక

బిక్కవోలు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణలు అందరినీ అబ్బురపరిచాయి. పందలపాకలో ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలించి విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు రాణించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి డాక్టర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణలను తిలకించారు. అనంతరం హెచ్‌ఎం పార్థసారథి మాట్లాడుతూ పుస్తక పఠనంతో పాటు శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, భారతి, సత్యదేవి, సావిత్రి, ప్రసాద్, సీఆర్పీ రాజు తదితరులు పాల్గొన్నారు.



పెదపూడిలో విద్యార్థులు తయారు చేసిన గ్రాస్ కట్టర్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సత్యనారాయణ

పెదపూడి: మండలంలో పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులతో తెల్ల కాగితంపై అక్షరాల సృష్టి, నీటిలో ముంచిన కాగితాన్ని మండించడం వంటి ప్రదర్శనలు చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన పలు సైన్స్ ప్రాజెక్టులను ఎంఈఓ-2 సత్యనారాయణ పరిశీలించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ జొన్నకూటి జాకబ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. పోస్టర్ పెయింటింగ్, ప్రాజెక్టులు, వక్తృత్వ విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరేరామకృష్ణ, అధ్యాపకులు ఎం.సుధామయి తదితరులు పాల్గొన్నారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు కన్నూరి సతీష్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఏజీ శేఖర్.. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ముఖ్య అతిథిగా ఎంఈవో కె.స్వామి నాయక్ విచ్చేశారు.


రాజానగరం: వెలుగుబంద ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. వివిధ అంశాలపై నమూనాలను ప్రదర్శనలిచ్చారు. హెచ్‌ఎం అగ్నేశ్వర రావు సైన్స్‌డే ప్రాధాన్యతను వివరించారు.



పందలపాకలో విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న హెచ్‌ఎం పార్థసారథి



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దర్జీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అనపర్తి: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమంతో పాటు దర్జీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం అనపర్తి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా కుట్టుమెషీన్‌ను కనుగొన్న విలియమ్ హో చిత్రపటానికి టైలర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు ర్యాలీగా ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకుని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల టైలర్స్ అసోసియేషన్ భవన సముదాయానికి స్థలాన్ని కేటాయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నక్కా రామకృష్ణ, అధ్యక్షుడు రాపర్తి సత్యనారాయణ, కార్యదర్శి కానూరి కృష్ణ, అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి

రాజమహేంద్రవరం సిటీ: 'నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశాను, ఎమ్మెల్యేగా ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తాను' అని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక 24వ డివిజన్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. వార్డులో సమస్యలు ఏమైనా ఉంటే, పరిష్కార చర్యలు చేపడతానన్నారు. చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. గోదావరి గట్టును హైదరాబాద్ ట్యాంక్ బండ్ కంటే అద్భుతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అజ్జరపు వాసు, 24వ డివిజన్ ఇన్‌చార్జి అరవ సురేష్, బెజవాడ రాజ్ కుమార్, కాంతారామ్ పటేల్, అందనాపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి నిరంతర కృషి

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు.